



రిక్షా యజమానికి అప్పగించి తన గుడిసెకు బయలుదేరాడు పాపారావు. యజమాని వొకగంట ఆలస్యంగా వొచ్చావు అని బెదిరిస్తే రెండు అణాలు ఆయన చేతిలోపెట్టి బయట పడ్డాడు. రోజుకి అద్దెగా యిచ్చే రూపాయిన్నరకు తోడు యిది.

పాపారావుకి ఆ రోజు రెండున్నర రూపాయలు మిగిలినై. అతని సంతోషానికి మేరలేకుండా వుంది. అతడు తన గ్రామంలో వున్నప్పుడు ఇంతడబ్బు ఏనాడూ చూచి ఎరగడు. రోజంతా పొలం చాకిరీచేస్తే మహావస్తే రూపాయివచ్చేది. ఆయితే సంవత్సరానికి ఆరునెలలు పనే

వుండేదికాదు. ఇక్కడ పనిలేకపోవడం అనే ప్రశ్నలేదు. ఓపికవుండాలిగాని.

అయితే అన్నానిదే అతనికి కొంచం కష్టంగా వుంది. కూరానారా బాగానే వుంటుండేగాని. వారు నలుగురు కలిసి వొక చిన్నగది అద్దెకు తీసుకొని వుంటున్నారు. నలుగురుకీ కాంతమ్మే వండి పెడుతో వుంటుంది కాంతమ్మకు దిక్కెవరూ లేరు. పాతిక సంవత్సరాలకంటే వయస్సు ఎక్కువవుండదు. తమకు ఇంత వండి, తానింత తిని ఎక్కడికో వెళ్ళిపోతుంది. మళ్ళీ వంటవేళకుగాని రాదు.

కాంతమ్మకు తనంటే ఇష్టము. అందరికంటే వొకమెతుకు తనకే ఎక్కువ పెడుతుంది. ఎవ్వరూ చూడకుండా కాస్త కూర ఎక్కువే వేస్తూ వుంటుంది. కాని ఒకరితో ఒకరికి పొత్తు లేని నలుగురు కలిసి ఒక ఆడమనిషితో వండించుకొని తినటం అతనికి బాగుండలేదు. ఆమె ఎవరు తమకు వండిపెట్టటానికి? వండితే తల్లి వండాలి; లేకపోతే పెళ్ళాం వండాలి. ఈమెకూ తమకూ ఏమిసంబంధం అని ఈమెతో వండించుకోవటం?

అతని మనస్సుకి ఏమీ బాగుండలేదు. ఆమె అన్నం వడ్డించటానికి వచ్చినప్పుడల్లా పెళ్ళికూతురుకుమల్లే తల వంచుకు కూర్చునేవాడు మొదటిరోజుల్లో. నోట మాట పెగిలేదికాదు. ఆమె ఎగతాళికూడా చేసేది. "ఈ కొనకొడిని ఎక్కడినుంచి పట్టుకువచ్చారు?" అని.

"మేమూ మొదట్లో అట్టా వున్నోళ్ళమే. నాలుగురోజులు పోనీయ్ కోడికూతకు వస్తదోలేదో నువ్వే చూద్దువుగాని" అనేవారు మిగిలిన ముగ్గురూ.

కాంతమ్మంటే మిగిలిన ముగ్గురికీ చనువే. ఆమెతో సరసాలాడేవారు. ఆమె ఊరుకునేదికాదు. ఎవరు తిరిగి వారు అన్నదానికంటే పదిరెట్లు అనేది.

పాపారావుకి వాళ్ళ సంబంధం బొత్తిగా అర్థమయ్యేదికాదు. నాలుగు మెతుకులు కొరికి లేచిపోయి బయట పక్క వేసుకొని పడుకొని నిద్రపోయేవాడు.

ఒకరోజు అట్లాగే పడుకుంటే కాంతమ్మవచ్చి సరసన కూర్చుంది. అతనికి తేళ్ళూ, జెర్రులూ పాకినట్టయింది. నిద్ర పోయినట్లు పడుకున్నాడు.

"ఏందయ్యా వొకటే నిద్దర; లే కాసేపు కబుర్లు చెప్పు" అని వీపుతట్టి లేపింది కాంతమ్మ.

అప్పటికీ లేవటాని కిష్టంలేక, వొక మూలుగు మూలిగి, ముణగదీసుకు పడుకున్నాడు పాపారావు.

"కోణంగిచేష్టలు చాలా వున్నయే" అని చక్కలిగింతలు పెట్టింది కాంతమ్మ.

పాపారావు ఏదైనా తట్టుకోగలడుగాని చక్కలిగింత తట్టుకోలేడు. గుక్కలుపట్టి నవ్వుతూ గిజగిజ తన్నుకున్నాడు.

"ఊరుకో, లేస్తా" అన్నాడు.

ఆమే వూరుకోలేదు.

"నీకు దణ్ణంపెడతా, ఊరుకో" అని ప్రాధేయపడ్డాడు.

"అట్లా దారికిరా" అని వొదిలి పెట్టింది.

పాపారావు లేచి కూర్చున్నాడు. రొప్పుతూ, 'ప్రాణాలు తీసేశావ్' అన్నాడు.

"ఇంత మాత్రానికే?" అని నవ్వింది కాంతమ్మ.

నెమ్మదిగా కబుర్లలోకి దింపింది. అతని సంగతులన్నీ అడిగి తెలుసుకుంది.

"నరేగాని నువ్వెక్కడనుంచి వొచ్చావ్?" అని అడిగాడు పాపారావు.

"ఆకాశాన్నుంచి."

"ఆకాశంలో వుండే చుక్కవా నువ్వు? గాలికి రాలిపడ్డావా?" అని పరియాచికం ఆడాడు పాపారావు.

"అబ్బో చాలవరకుందే అబ్బాయి తెలివి!" అని ఆశ్చర్యం వెలిబుచ్చింది కాంతమ్మ.

"పోనీ చెప్పకపోతే చెప్పకపోయావు. వాళ్ళు నీకేమవుతారో చెప్పు."

"ఎవళ్ళు?"

"వాళ్ళు" అని దూరంగా పడుకున్న మిగిలిన ముగ్గురునీ చూపాడు పాపారావు.

"బావలు" అన్నది కాంతమ్మ.

"మరి నేనేమవుతాను?"

"బుల్లిబావవి."

"ఛీ పో" అన్నాడు పాపారావు సిగ్గుతో తల వంచుకుంటూ.

"ఏం?" నాకంటే మంచిమరదలు దొరుకుద్దా నీకు?"

"నాకు మరదలే వద్దు" అన్నాడు పాపారావు.

"అదీ చూద్దాంగా ఎన్నాళ్ళో?" అన్నది కాంతమ్మ.

ఇద్దరూ కాసేపు మెదలకుండా కూర్చున్నారు. చివరకి పాపారావు ధైర్యంచేసి అడిగాడు, "మాకు అన్నాలు పెట్టి, నువ్వు యాడకు పోతావ్?"

"వూళ్ళోకి"

"వూళ్ళో ఎవరున్నారు నీకు?"

"లక్షమంది బావలు" అన్నది కాంతమ్మ. పాపారావు బిగ్గరగా నవ్వాడు.

"ఏం? అన్ని ఇవరాలు అడుగుతుండావు? నన్నేమన్నా అదుపులో పెడతావా?"

"లేదులే, ఊరికినే అడిగా!"

ఆమె సమాధానం చెప్పలేదు. కాసేపు ఇద్దరూ మెదలకుండా కూర్చున్నారు. దూరంగా పడుకునివున్న ముగ్గురూ తమనే చూస్తూవున్నారని గ్రహించాడు పాపారావు. తనకుమల్లే వాళ్లూ పొట్టకోసం టౌనుకి వచ్చినవాళ్లే. అందులో వొకని పేరు శివయ్య. చేతిబండి లాగుతూ వుంటాడు. రెండవవాని పేరు వెంకన్న. అతను తనకు మల్లేనే రిక్షాలాగుతూ వుంటాడు. మూడవవాని పేరు ముసలయ్య. కూరగాయలు లాట్లు లాట్లుగా కొని తోపుడు బండిమీద వూరంతా తిప్పి

అమ్ముతూ వుంటాడు.

వాళ్ళందరూ తనంటే ఇష్టంగానే వుంటారు. కాని వుండి వుండి వొకరోజు ఏం పుండు పుడుతుందో; సూటిపోటి మాటలు అంటూవుంటారు. అది మామూలుగా కాంతమ్మ తనతో వొంటరిగా మాట్లాడిన రోజు అయివుంటుంది తాను కాంతమ్మతో మాట్లాడటం వాళ్ళకుకోపం అవి గ్రహించాడు పాపారావు. ఎందుకువాళ్ళకి అనవసరంగా కోపం తెప్పించటం? అవి కాంతమ్మకి వొంటరిగా కనపడకుండా తప్పుకు తిరుగుతుండేవాడు.

"ఏమిటి ఆలోచిస్తుండావు?" అని అడిగింది

"అళ్లు మననే చూస్తున్నారు" అన్నాడు పాపారావు.

"ఏడవనీ" అంది కాంతమ్మ

అతనికి కొంచెం ధైర్యం వొచ్చింది. "నువ్వు యాడపుట్టావు? ఈడకి ఎందుకు వొచ్చావు? సవిస్తారంగా చెప్పు" అని అడిగాడు

"నీకు మల్లేనే పుట్టా. నీకు మల్లేనే వొచ్చా"

"వసవసలుపోక ఉన్నది వున్నట్టు చెప్పు."

అతను గట్టిగా అడిగేటప్పటికి, "ఎంత చెడ్డా మొగాడు మొగాడే" అనుకొని చిరునవ్వు నవ్వుకుంది కాంతమ్మ.

తన ఊరుపేరు చెప్పింది. మొగుడ్ని విడిచిపెట్టి వచ్చానని చెప్పింది. కోటనాద్రి అనే కట్టుమిషన్ పనిచేసే అతను వాళ్ళ ఊళ్లో వుండేవాడట. అతనితో లేచివచ్చి వేసిందట

"మొగుడ్ని ఎందుకు యిడిచి పెట్టావు?" "కొట్టేవాడా?" అని అడిగాడు పాపారావు.

ఆమె నవ్వి. "నీ తెలివి తగలడ్డట్టే వుంది" అన్నది.

"యేం?"

"కొట్టే మొగుడ్ని యే ఆడదన్నా ఇడిసిపెడుతుందటయ్యా?" అని అడిగింది.

పాపారావుకు అర్థంకాలేదు మామూలుగా యిడిచిపెట్టబడ్డ మొగుళ్ళు మంచి వాళ్ళుగానే వుంటారనే సంగతి అతనికి జ్ఞాపకం వొచ్చింది. తన స్వగ్రామంలో చిన్నయ్య అనే వొక రైతు వుండేవాడు. అతను చాలా మంచివాడు. యెవర్నీ పల్లెత్తుమాటైనా అనేవాడుకాదు. అతని భార్య లేచిపోయింది యెవ్వరితో? తాడూ బొంగరంలేని వొక తాగుబోతుతో; అయినా కాంతమ్మ యవ్వారం యింకా వివరంగా తెలుసుకోవాలనుకున్నాడు.

"మరెందుకు లేచిపోయావ్?" అని అడిగాడు.

"అతను వొట్టిమొద్దు పొద్దున్నే చద్దిబువ్వతిని పొలం పనికిపోయేవాడు. మళ్ళీ పొద్దుగూకినాక తిరిగొచ్చేవాడు. యిన్ని వేన్నీళ్ళు పోసుకుని అన్నం తిని పడుకొని నిద్రపోయేవాడు యే యేటికో కోటికో నేను మొద్దునిద్దర్లో వున్నప్పుడు

వచ్చి నా కాలు గిరేవాడు''

కాలుగిరే విధానానికి అతనికి నవ్వొచ్చింది. బిగ్గరగా నవ్వాడు.

"అందరూ అంతేలే?'' అన్నది కాంతమ్మ చిరునవ్వు ఆపుకుంటూ.

''ఆ సంగతి నీ కెప్పుడు తెలిసింది?''

"టౌనుకి వచ్చినాక''

''నేను యెప్పుడన్నా నీ కాలుగిరానా అందరూ అంతేలే అంటున్నావుగానీ!'' అని అడుగుదాం అనుకున్నాడు పాపారావు. సిగ్గువేసి మాట మార్చాడు.

''యిప్పుడు యాడ వుంటున్నాడు?''

"యెవడు!''

''ఆ కుట్టుమిషన్‌వాడు'' అన్నాడు పాపారావు.

''మరొకదాన్ని పెట్టుకొని యీడనే వున్నాడు.''

"ఈడకు తీసుకువచ్చి నిన్ను ఇడిసిపెట్టివేశాడా.''


ఈ ప్రశ్నకు కాంతమ్మ స్వాతిశయం దెబ్బతిన్నది ''అదిని నేనే ఇడిసిపెట్టా'' అన్నది కోపంగా.

''కాదు అదే నిన్ను యిడిసిపెట్టాడు. నాకు తెలుసు ' అన్నాడు పాపారావు.

''నీ కెట్లా తెలుసు! నువ్వు యెవరన్నా ఇడిసి పెట్టావా."

''యిడిసి పెట్టినోళ్ళని చూశా! లేపుకు రావటం, ఇడిసి పెట్టటం అదే ఆళ్ళ పని''

"అబ్బో, పెపంచకం అంతా తనిఖీ చేసి వోడికి మల్లే మాట్లాడుతుండవే!''




అన్నది కాంతమ్మ. అతని మాటలకు ఆమె లోలోపల మురిసింది.

''ఆ మిషనోడి దగ్గర్నుంచి ఈడకు వొచ్చావన్నమాట!''

''మద్దెన వొకకాడ మకాంచేస్తినే!'' అన్నది.

"యాడ?''

''టౌన్లో సైకిల్‌షాపు పెట్టుకున్నాడే ఈరయ్య: ఆడికాడ.''

పాపారావుకి జ్ఞాపకం వొచ్చింది ఆ షాపు. ఒకసారి నాకు సైకిలు కావలసివస్తే కాంతమ్మ అక్కడ ఇప్పించింది. అతను అద్దె తీసుకోకుండానే ఇచ్చాడు ఎందుకు యిచ్చిందీ, అప్పుడు తనకు అర్థంకాలేదు.

సైకిలుయిచ్చి "ఎక్కడా కనపట్టం లేదేమే కాంతమ్మా?'' అని అడిగాడు.

''కనపడాల్సిన కర్మ నాకేంపట్టె?'' అన్నది కాంతమ్మ.

"కొత్తపిట్టని ఎక్కడో పట్టినట్టు న్నావే?" అన్నాడు తనవంకకు చూస్తూ.

"కాలువగట్టుమీద" అన్నది కాంతమ్మ.

"ఒకసారి కనపడు" అన్నాడు వీరయ్య స్వరం తగ్గించి

"తీరికవుంటే చూస్తాలే" అన్నది కాంతమ్మ.

ఇదంతా జ్ఞాపకంవొచ్చి "ఆడి నీ నువ్వే యిడిపి పెట్టావా?" అని అడిగాడు పాపారావు.

"నిజం చెవితేమాత్రం నమ్ముతావు గనకనా!" అన్నది కాంతమ్మ.

నమ్ముతాలే."

"నేనే యిడిపిపెట్టా."

"ఎందుకు?"

ఆమె ఒక్కక్షణం ఆలోచించి "ఏందో అనుకుంటాం గాని అబ్బాయి; ఈ మొగాళ్ళంతా ఒక్కటే. పదిరోజులు ఆళ్ళతో కాపరంచేస్తే ఆళ్ళ మొహం చూడ బుద్ధి అవదు" అన్నది. ఇదివరకు మల్లే నవ్వుటాలకుకాకుండా యీసారి సీరియస్‌గా చెప్పింది. పైకి ఆమె అవాకులు చెవాకులు పేలుతున్నా లోపల చాలా బాధ పడుతూ వున్నట్టు పాపారావుకి సైతం గోచరించింది.

"టౌన్‌కి వచ్చినాక మళ్ళీ మీవూరు ఎప్పుడన్నా వెళ్లావా?"

"ఎళ్ళలా."

"అతనెప్పుడన్నా కనిపించాడా!"

"ఎవడు?"

"ఆ కాలుగిరేవాడు"

ఆ మాటకు గుక్కలుబట్టి నవ్వింది కాంతమ్మ. "ఒట్టప్పుడుకాదు. ముద్దులిద్దర పోనిచ్చి అప్పుడు గిరేవాడు వాడిజిమ్మడ" అని విరగబడి నవ్వింది.

"ముత్తానికి గట్టోడివే" అని ప్రశంసాపత్రం పారవేసింది.

"ఇంతకీ అతను కనిపించాడో లేదో చెప్పలేదు" అన్నాడు పాపారావు.

"కనిపించకే? నెలకొకతూరయినా కనిపిస్తావుంటాడు."

"ఏమంటాడు?"


"నన్ను యింటికి రమ్మంటాడు. మొదట్లో నన్ను చూసినప్పుడు అతగాడికి నన్ను గుర్తుపట్టటమే కష్టం అయింది. వూళ్ళో అందరూ నువ్వు చెడిపోయావని అంటుంటే నిజమే అనుకున్నా. నీ కేం? బంగారంలాగున్నావు. ఒళ్లుకూడా చేశావు అన్నాడు ముద్దుచచ్చినాడు"

"ఈ మద్దెన ఎప్పుడన్నా కనబడ్డాడా?"

"నిన్నకాక మొన్ననేగా కనపడ్డది. నెలకొకసారి ఏదో ఒక పనిమీద వస్తాడు. నేను కనపడేదాకా కాలవ వంతెనమీద కూర్చుంటాడు. చూసిగాని ఎళ్ళడు."

"ఏమన్నాడు?"

"మామూలుపాటే 'నువ్వు యెళ్ళిం దగ్గర్నుంచీ తిండికూడా సరిగా అమరటం లేదే. కూడు ఉడకేసి పెట్టేవాళ్ళు కూడా లేక మొహంవాచి వస్తున్నాను. రావే' అన్నాడు "




"పోనీ ఎల్లగూడదూ?"

"నే చచ్చినా ఎళ్ళను."

"ఎందుకనేం" అని రెట్టించి అడిగాడు పాపారావు.

"నీ కెందుకయ్యా యీ ఆడోళ్ళ సంగతులన్నీ?" అని కసిరింది కాంతమ్మ. కసరటానికి కసిరిందిగాని వెంటనే పశ్చాత్తాప పడింది.

"అతగాడు నాకు కనిపిస్తే కాలు గీర వొద్దని చెపుతాలే వెళ్ళు" అన్నాడు పాపారావు.

"గీరినా మేలుకాని ఉన్నప్పుడు గీర మను" అన్నది కాంతమ్మ చెంగునోటికి అడ్డపెట్టుకొని నవ్వుతూ.

"నిజంగా నువ్వు మీ ఊరు వెడితేనే బాగుంటుంది కాంతమ్మా" అన్నాడు పాపారావు నవ్వులు ఆగిన పిమ్మట.

"నాకూ వెళ్దామనే ఉందయ్యా. ఆ ముసలాడిని చూసినప్పుడల్లా ఎక్కడలేని జాలీ ముంచుకొస్తుంది. అతగాడు అడిగేదల్లా ఇంత ముద్ద ఉడకేసి పెట్టమనేగదా. అడ్డమైనోళ్ళకీ ఉడకేసి పెట్టగాలేంది, కట్టుకున్నోడికి ఆడికి ఉడకేసి పెట్టటానికేం? కాని నాకు ఆ ఊళ్లో ఏమీ తోచదయ్యా ఎళ్ళినా మళ్ళీ నాలుగు రోజుల్లో తిరిగి రావలసిందే ఎళ్ళటం ఎందుకు? రావటం ఎందుకు? ఆ ముసలోడి పుండుమీద కారం జల్లినట్లేగా అయ్యేది? అందుకని నేను ఎళ్ళనే ఎళ్ళను" అన్నది.

ఇక అప్పటికి ఆ సంగతి ఆపేశాడ పాపారావు కానీ కాంతమ్మ సుఖపడలంటే మొగుడి దగ్గరకు వెళ్ళటంకంటే వేరుమార్గం లేదని నిశ్చయించుకున్నాడు. ఇప్పుడు కాకపోయినా ఎప్పటికయినా త

మాట వింటుందనె ధైర్యంకూడా అతనికి కలిగింది.

ఇక్కడ ఎవ్వరున్నారు ఆమెకు? వంట్లోసత్తువ ఉన్నన్నాళ్లూ ఆ పనీ ఈ పనీ చేయించుకొని ఇంతముద్ద పెడతారు. తరువాత ఆమె ఎవరికి కావాలి? కుళ్ళిన టొమాటోను విసిరి ।పారవేసినట్లు యే చెత్తగుట్టమీదకో విసిరి పారవేస్తారు.

అన్నిటికంటే ఇంతమంది మొగాళ్ళను చూచినపిదప కాంతమ్మకు మిగిలింది మొగుడిమీద ఇష్టమే .అని గ్రహించాడు పాపారావు. అందుకని వాళ్ళని కలపాలను కున్నాడు.

పాపారావు ఆలోచనలను కొంత వరకు కవిపెట్టింది కాంతమ్మ. "నా గొడవల్తో నీ కెందుకయ్యా? పడుకొని నిద్రవో. ఆలస్యం అయితే వేకువజామున లెగవ్వు. రిక్షా లాగటం కూడా కష్టం అవుతుంది. మరి నేను వెళ్తాస్తా" అని లేచింది

"ఎక్కడకు పోతావిప్పుడు?" అని అడిగాడు పాపారావు.

"ఏట్లోకి" అని సమాధానం చెప్పింది కాంతమ్మ. ఆమె ఈ మాట నవ్వుతూనే అన్నా నిజమే, చెప్పిందనిపించింది పాపారావుకి. మాట్లాడక వూరుకున్నాడు.

కాస్తదూరంలో పడుకొని వాళ్ళని గమనిస్తున్న వాళ్ళల్లో వొకరిపేరు శివయ్య అని చెప్పాను. అతను చేతిబండి లాగుతూ ఉంటాడని కూడా చెప్పాను. అతనిని పిలిచింది కాంతమ్మ, "ఓ పెద్దబావా! నన్ను సాగనంపుదువుగాని రా" అని.

"ఎక్కడికే? అత్తోరింటికా?" ఆ పరియాచకం ఆడాడు శివయ్య.

"అత్తోరింటికి పంపే అంత మనిషవు వాడిపీనూ నువ్వు" అన్న కాంతమ్మ.

"మరెక్కడికే?"

"తాటితోపుదాకా పంపొద్దువుగా! అక్కడ వుండే దెయ్యాలని చూస్తే నా భయం బావా?" అని అన్నది కాంతమ్మ

"సరిపద. మరదలుపిల్ల మాట ఇన పోతే నోట్లోకి మెతుకు దూరదు" అ లేచి, పక్కకు వేసుకున్న పై పంచ దులుపుకొని, తలకు చుట్టుకొని బయలు దేరాడు శివయ్య.

ఇద్దరూ చీకట్లో కలిసిపోయారు.

పాపారావు ఆలోచిస్తూ పడుకున్నాడు అతను టౌనుకి వచ్చి ఇంకా నెల రోజ లన్నా కాలేదు. అంతా కొత్తగావుంది రిక్షా లాగటం ఇంకా అతనికి అభిమానం గానే వుంటూవుంది. నిగ్గదీసి డబ్బు అడ గటం చేతగావటం లేదు. అయినా ఇంత వరకు పది రూపాయలూ మిగిల్చి స్వగ్రా మంలో ఉన్న తల్లికి పంపాడు.

డబ్బు అయితే సంపాదిస్తున్నాడు గాని, దానితోపాటు మనస్సులో ఆరాటం పెరుగుతూ వుంది. టౌన్లో ఎవ్వరినీ నా వాళ్ళు అనుకోటానికి వీల్లేదు. ఎవరిని నమ్మడానికి వీల్లేదు. వీలుదొరికితే అందరూ ఆరడికొట్టేవాళ్ళే.

ఇటువంటిచోట కాంతమ్మవంటి ఆశ మనిషి యిన్నాళ్ళూ బ్రతకటమే అతనికి చోద్యంగా కనిపించింది. ఆమెమీద అమితమైన జాలి కలిగింది. ఆరోజు మొదలుకొని వారిద్దరిమధ్యా యితరులకు అర్థంకాని ఒక సంబంధం ఏర్పడి ఉంది.

* *

ఆ రోజు రిక్షా యజమానికి అప్ప గించి యింటికి వచ్చేటప్పటికి కాంతమ్మ నేలమీద పడుకొని ఉంది. శివయ్య ఇంకా ఇంటికి వచ్చినట్లు లేదు మిగిలిన ఇద్దరూ తిండితిని బయట చాపలు పరచుకొని పడుకొని ఉన్నారు.

"అన్నం పెడతావా కాంతమ్మా?" అని అడిగాడు.

'పెట్టుకు తినవయ్యా" అన్నది కాంతమ్మ.

అతనికి కష్టంవేసింది. తను వచ్చేదాకా ఎదురుచూస్తూ కూర్చొని రాగానే అన్నం పెట్టేది తనకు అన్నం పెట్టటం ఆమెకు సరదాగా ఉండేది.తాను అన్నం తింటుంటే ఎదురుగా కూర్చొని ఆ రోజు వూళ్ళో జరిగిన సంగతులన్నీ చెప్పేది. 'ఆ వచ్చి నాడు కలిశాడు' అనేది. అడిగితే ఏ వచ్చి నాడో చెప్పేది. ఆ కథంతా ఏకరువు పెట్టేది ఇవాళ ఎందుకు ఇంత సాదాతగా వుంది?

"ఒంట్లో బాగాలేదా?"

"బాగాలేదయ్యా."

అతను వెళ్ళి కుండలో అన్నం పళ్ళెం లోకి పెట్టుకున్నాడు. పిడతలో వంకాయ పచ్చడి ఉంది. ఇంకా ఏమన్నా చేసిందేమో నని వెతికాడు.

"ఇవాళ ఏమీ చెయ్య నవసరంలేదు" అన్నది కాంతమ్మ కండ్లు తెరవకుండానే.

పచ్చడి కలుపుకుతిన్నాడు. ఒక గ్లాసుడు మంచినీళ్ళు గటగట తాగేశాడు.

"చల్ల ఉట్టిమీద ఉన్నయి" అని నీరసంగా చెప్పింది కాంతమ్మ. మజ్జిగ పోసుకుని రెండు ముద్దలు తిని లేచాడు పాపారావు.

"అప్పుడే లేచావేం?"

"తిన్నాను."

"ఇవాళ వొక్కకూరన్నా వండిపెట్ట లేక పోయాను" అని విచారించింది కాంతమ్మ.

"దానికేంగాని, ఏందంట ఈ వంట్లో జబ్బు?"

"ఏమీలేదు."

"చెప్పవా?"

కాసేపు ఆలోచించి, "నీతో చెప్పేది కాదులే" అన్నది కాంతమ్మ.

"మరెవ్వరితో చెపుతావ్‌? నీ పెద్ద బావతోనా?"

కాంతమ్మ కాసేపు ఆలోచించింది. ఆ దీపపు వెలుగులో అతని ముఖకవళికలు చూడటానికి ప్రయత్నించింది. అతనికి కోపంవచ్చి అన్న మాటగాలేదు. "అడి కెందుకు చెప్పటం?" అన్నది. "ఆర్చే వాడా, తీర్చేవాడా?"

ఆమెకు తెలియకుండానే, ఆమె కంఠంలో కన్నీరు పలికింది. ఆమె యీ జీవితంలో అనుభవించిన బాధలన్నీ ఆ ధ్వనిలో పాపారావుకి వినిపించినై. అంతకుముందు ఏ తలనొప్పో, కాలు నొప్పో అనుకొని తుస్కారించాడు. ఇప్పుడు అట్లా అనిపించలేదు. ఆమెకు దగ్గరగా కూర్చొని, 'పోనీ వైద్యుణ్ణి తీసుకొస్తా'' అన్నాడు.

''మందులకు తగ్గేజబ్బు కాదు లేవయ్యా'' అని ఈసడించివేసింది కాంతమ్మ. ''నీ కెందుకు? నువ్వెళ్ళి పడుకో'' అన్నది.

అతను కాసేపు ఊరుకున్నాడు. కళ్ళల్లో నీళ్ళు నిలచినై. ఇలా అన్నాడు.

''నీకు జబ్బుగావుంటే నా మనసు బాగాలేదు కాంతమ్మా. నాకు నిద్దరకూడా పట్టదు. పలాని జబ్బని చెపితే నీ సొమ్మేం పోయింది? ఇవ్వాళ నేను రెండున్నర రూపాయలు సంపాదించాను. నీతో చెబితే సంతోషిస్తావుగదా అని గబగబా వచ్చాను. నువ్వు ముసుగేసుకు పడుకున్నావు. జబ్బేమిటంటే చెప్పవు. ఇది నీ కేమన్నా బాధగా ఉందా కాంతమ్మా?''

పాపారావు మనస్సును చీల్చుకొని వచ్చిన ఈ మాటలకు కాంతమ్మ ఊగి పోయింది సంఘంలోవున్న బటాచోరు లందరినీ తృణీకరిస్తూ తిరిగేటట్టు చేసిన శక్తి ఆ క్షణం ఏమయిందో! కన్నీరు వోడికలు కట్టేటట్టు ఏడ్చింది మినుకు మినుకుమంటూ వెలుగుతున్న ఆ కిరసనాయిలు దీపం పాపారావునుంచి ఆమె కన్నీటిని దాచింది. ఆమె మనస్సులో ఏదో నిర్ధారణ చేసుకొని చీరె చెరుగుతో కన్నీరు తుడుచుకొని లేచి కూర్చుంది.

''ఏమంటున్నావా కాంతమ్మా?'' అని అడిగాడు పాపారావు.

''లేదయ్యా.''

''పోనీ చెప్పకపోతే చెప్పక పోయావులే .. ''

''చెప్పగూడదని కాదయ్యా.''

''మరెందుకంట?''

''ఇప్పుడు నా కొచ్చింది ఆడోళ్ళ జబ్బు.''

''ఏం దది?''

''నాకు నెల తప్పిందయ్యా ''


ఒక్క క్షణం పాపారావుకి ఏమీ తోచ లేదు. ఈ నెలతప్పడం అనేమాట సంతోషంగా చెప్పినవాళ్ళను అతను ఎరుగును. ఆడమనిషినోట ఈ మాట ఇంత బాధగా వినటం అతనికి యిదే మొదటిసారి. వెంటనే ఆమె బాధకు కారణం అతనికి తట్టింది.

''ఎవరు? ఎవరు కాంతమ్మా?'' అని ప్రాణాలు బిగబట్టి అడిగినట్లు అడిగాడు.

''ఎట్లా చెప్పేది?'' అన్నది కాంతమ్మ.

అతనికి ఆమె పరిచయస్తులంతా వొక్కసారిగా జ్ఞాపకం వొచ్చారు.

''సైకిల్‌షాపు యీరయ్యా?'' అని అడిగాడు.




“రండి, వెళ్దాము!”

“అవ్వొచ్చు” అన్నది కాంతమ్మ.

“పెద్దబావ శివయ్యా?”

ఆమె ఒక్క పెద్ద నిట్టూర్పు విడిచి, “అవ్వొచ్చు” అన్నది ఇక అతను అడగలేకపోయాడు అతిప్రయత్నంమీద మనస్సును సర్దుకున్నాడు “అయిందేదో అయింది కాంతమ్మా దీనికి నువ్విట్లా దిగులుపడి కూర్చోవటం ఎందుకు!” అని అడిగాడు.

“నీకు తెలియదు లేవయ్యా.”

“ఏంది!” విసుగ్గా అడిగాడు

“నా బిడ్డ అయ్య ఎవరంటే యేం చెప్పేది! బిడ్డని ఎట్లా పెంచేది! బిడ్డ పెరిగి ‘నా అయ్య ఎవ’రంటే ఏం చెప్పేది!’ అని ఆక్రోశంగా అడిగింది, తన కష్టాల కన్నీ అతనే బాధ్యుడు అన్నట్లు.

పాపారావుకి వొక కొత్తచూపుపడింది. మనసు తొలిచింది. కొన్ని సమస్యలు ప్రారంభం అయినప్పుడు నామమాత్రంగా ఉండి క్రమక్రమేణా భయంకరరూపం తాలుస్తయి. అందుకని ఈ కొత్తచూపు బలపడినకొద్దీ భయం వేసింది. తాను స్వగ్రామంలో ఉన్నప్పుడు ఎవ్వరో పసిగుడ్డుని గొంతుపిసికి వొదలో పార వెయ్యటం చూశాడు ఇంకా వొత్తి గుడ్డలు ఆ బిడ్డచుట్టూ ఉండనే వున్నయి. ఏదో వొక సినిమాలో పెరిగిన కొడుకు నా తండ్రిపేరు చెప్పమని తల్లిని బాధించటం చూశాడు. ఒక తల్లి ఇతరుల పాపం బయటపడకముందే కాలువలోదూకి ప్రాణాలు తీసుకోవటం విన్నాడు

అతనికి ముచ్చెమటలు పోసినై.

“మరి ఇప్పుడేం చేస్తావ్?” అని అడిగాడు కాంతమ్మని.

అతని కంగారుచూచి "ఏదో వొకటి చేస్తాలేవయ్యా" అన్నది కాంతమ్మ.

అంతటితో అతను వొదిలిపెట్టలేదు. "నాకు చెప్పాలి" అని భీష్మించుకొని కూర్చున్నాడు

"ఒక గిద్దెడు పసరు పుచ్చుకుంటే సరిపోయే" అన్నది

"ఒద్దు" అన్నాడు పాపారావు.

"ఏం."

"అయ్యన్నీ మోటు మందులు. తల్లికి కాళ్ళూ, చేతులూ పడొచ్చు ప్రాణాల మీదకు రావొచ్చు అంతకీ ఆ బిడ్డ అయ్య పేరు చెప్పాల్సొస్తే నా పేరుచెప్పు"

"నీ కేం సంబంధం?"

"నిన్నెరిగుంటమే సంబంధం"

"సరేలే, నువ్వెళ్ళి పడుకో."

"ఆ మోటు పనులకు దిగవద్దు."

"నీతో చెప్పకుండా ఏపనీ చెయను గానీ, నామాట విని నువ్వెళ్ళి పడుకో"

పాపారావు చాప తీసుకొని బయటకు వెళ్లాడు అతనిని వెళ్ళనిచ్చి ఆవుర్న ఏడ్చింది కాంతమ్మ ఆమెకు జీవితంలో ఇంతవరకు పాపారావువంటి మనిషి తగ ల్లేదు. మగవాళ్ళంతా మోసగాళ్ళే అను కుంది. తనదగ్గరకు వచ్చే మగవాళ్ళంతా మోసగాళ్ళే అనుకుంది తన దగ్గరకువచ్చే మగవాళ్ళంతా వొకే కోర్కెతో వస్తారను కుంది, అందుకనే మగవాళ్ళపట్ల విరసన భావం పెంచుకొని ఇన్నాళ్లూ బ్రతికింది. ఆ విరసనభావమే ఇన్నాళ్లూ ఆమెకు ఆధారంగా ఉండి బ్రతుకును నడిపింది. ఇప్పుడది వొక్కదెబ్బతో తుత్తునియలైంది. ఈ పాపారావు తనకు వరు? తననుంచి కోరేది ఏమిటి? ఏమీలేదు. అయినప్పుడు తనంటే అతనికి ఎందుకు ఇష్టం? తను మొయ్యవలసిన నిందను అతను మొయ్యటానికి సిద్ధపడ్డాడు. ఇంతకుముందు తను ఎరగని జీవిత లక్షణం ఏదో తన అనుభవం లోకి వస్తున్నట్లనిపించింది కాంతమ్మకి. అలాగే పడుకొని నిద్రపోయింది.


* * *

ఆనాటినుంచీ కాంతమ్మ తన సంగతి ఆలోచించటం మానివేసింది. ఆమెకు గర్భిణి అని మిగిలిన ముగ్గురికీ తెలిసింది. ఆమెను లేకుండా చూచి ఎగతాళిగా మాట్లాడుకుంటూ ఉండేవారు వారి మాటలు వినలేక, "ఆ కలగబోయేది నా బిడ్డే" అని చెప్పాడు పాపారావు.

"అనగానే సరిపోయిందీ." అన్నాడు శివయ్య

శివయ్య ఆ మాట అనేటప్పటికి ఎక్కడలేని కోపం వచ్చింది పాపారావుకి. "ఆబిడ మనకు అన్నం వండి పెడతాఉంది అందుగ్గాను ఆబిడ సంగతులు ఎత్తవలసినపని మనలో ఎవ్వరికీ వుండరాదు. అల్లావుంటే మనకి కుదురుతుంది లేకపోతే ఎవరివారినవాళ్లు పోవలసిందే" అన్నాడు

ఆ మాటతో మిగిలినవాళ్ళు భయపడి వూరుకున్నారు. భయం ఎందుకంటే




అక్కడ అసలు ఉడకేసి పెట్టేవాళ్లే దొరకరు. దొరికినా డబ్బుతీసుకోకుండా ఉడకేసి పెట్టేవాళ్ళు అసలు దొరకరు. కాంతమ్మముందు ఒక ఆడమనిషి వి మాట్లాడుకుంటే ఆమె ఉడకెయ్యటానికి ఇచ్చిన వస్తువులు ఇంటికి జేరవెయ్యటం మొదలుపెట్టింది.

ఈ కారణంవల్ల వాళ్ళు పైకి ఏమీ అనటంలేదుగాని వాళ్ల అయిష్టాన్ని రకరకాలుగా బయట పెడుతూనే వొచ్చారు. కాంతమ్మ బాధ్యతను తీసుకోవటం వాళ్లల్లో వొక్కళ్లకీ ఇష్టంలేదు. కాని పాపారావు కాంతమ్మ తన సొంతంఅయినట్లు మాట్లాడుతుంటే వాళ్లకి వొళ్లు మండేది. ఏ కూర వండటంమీదో, పచ్చడి నూరటం మీదో వంకబెట్టి తమ అక్కసు వెళ్లబోసుకొనేవాళ్ళు.

"పచ్చట్లో ఇయాళ మిరపగాయతే వేసినట్లులేదేం కాంతమ్మా?" అనేవాళ్లు.

"కూరలో కాస్త కరేపాకుకూడా ఏస్తే బాగుండేది" అనేవాళ్ళు.

"ఇవాళ అన్నం తోపచేశావేం?" అనేవాళ్ళు.

"అసలు నీ మనసు ఇక్కడ వుంటేగా" అనేవాళ్ళు.

వెనక అయితే మాటకు పదిమాటలు అనేది కాంతమ్మ. అప్పుడు ఎవళ్ళేమన్నా నవ్వుతూ ఊరుకునేది.

"నీళ్లాడడానికి ఆస్పిటాలికి తీసుకెళ్తాడటగా పాపారావు" అని అడిగాడు

శివయ్య ఒకరోజు యెకసెక్కెంగా.

"అసలాడు ఎదవైతే ఎవడో వొకడు తీసుకెళ్తాడు."

"అయితే నేనేనంటావా?"

"ఛీ నోరుముయ్?" అన్నది కాంతమ్మ.

"మరి గత్తే పుట్టబోయేబిడ్డ నా బిడ్డ అంటాడే పాపడు?" అన్నాడు.

అతనితో ఇక మాట్లాడి ప్రయోజనం లేదని మెదలకుండా ఊరుకుంది కాంతమ్మ.

"ఎట్లాఅయితే ఏంగాని కొడుకైతే మాత్రం నాపేరు పెట్టుకో మరదలుపిల్లా" అన్నాడు శివయ్య.

ఇట్లా వీలు దొరికినప్పుడల్లా ఏదో ఒకవిధంగా ఆమెను బాధించడం మొదలు పెట్టారు. ఆమె ఈ విషయాలేవీ పాపారావుకి తెలియనిచ్చేదికాదు.

జరిగిపోతున్నయ్ రోజులు. కాంతమ్మ వంటకూడా చెయ్యలేని స్థితికివొచ్చింది. ఆ పనికూడా తనమీదే వేసుకున్నాడు పాపారావు. పొద్దున్న అన్నంవండి రిక్షాతీసుకు వెళ్లేవాడు. సాయంకాలం అయిదుగంటల కల్లా వొచ్చేసి వంటకు కూర్చునేవాడు. మొదట్లో పాపారావు వంట చెయ్యటానికి ఆమె వొప్పుకోలేదు.

"ఎందుకయ్యా నీకీ కష్టం."

"ఇందులో కష్టం ఏముంది కాంతమ్మా! టౌను కొచ్చిన కొత్తలో కొన్నాళ్ళు నేనే వండుకుతినలా! నాకేం కొత్తగనకనా?"

"నిన్నుచూచి నీతోటివాళ్ళంతా నవ్వుతున్నారు."

"నవ్వనీ, వాళ్ళ పళ్లే బయటపడతై"

"నువ్వీయయ్యన్నీ పెట్టుకు కూచున్నావు. సగానికి సగంకూడా సంపాదనలేకుండా పోయింది."

"ఇంకెన్నాళ్ళులే. నువ్వు నీళ్లోసుకున్నాక ఇంతకుముందు సంపాదించిన దానికి మూడురెట్లు సంపాదించలే!పోతే నాపేరు మారుపేరున పిలువు."

"నువ్వు ఇంటికి డబ్బు పంపించి ఎన్నాళ్లయిందో గాపకంఉందా! ఇంటిదగ్గరోళ్లు ఏమనుకుంటారు."

అది నిజమే. ఈ మధ్య పాపారావు తల్లి ఉత్తరం కూడా వ్రాయించింది. గడవటమే కష్టంగా వుంది అన్నది. ఆమె విషయం తలుచుకున్నప్పుడల్లా మనస్సుకి దిగులుగానే వుంటుంది. కాని ఏంచేసేట్టు! ఏ కొద్దిగా పంపుదామన్నా డబ్బు మిగలటం లేదు.

"మాట్లాడవేమయ్యా!"


"నిన్నే పంపాను కాంతమ్మా" అని అబద్ధం ఆడాడు పాపారావు.

"నీ సంపాదన నాకు తెలియదా ఎట్టా! ఎక్కడనుంచి పంపావు?"

"ఒక స్నేహితుడి దగ్గర అప్పుచేసి పంపా.'

"ఆ అప్పెట్టా తీరుస్తావు?"

"రెక్కల కష్టంమీద" అన్నాడు



"ఏమండీ, మీ జబ్బుచూసి నాకు చాలా భయంగా ఉంది."

"డాక్టర్ను పిలిపించావా?"

"యిన్షూరెన్సు ఏజంటు మిస్టర్ రావును పిలిపించాను."

పొయ్యిమీద ఎసరుపెడుతూ.

"ఏమోనయ్యా నీసంగతి నాకేం బాగాలేదు. నీ సంగతి నువ్వు చూచుకోవు. నా మానాన నన్ను పోనివ్వవు" అని కన్నీరు పెట్టుకుంది కాంతమ్మ.

పాపారావు మనస్సు కలుక్కుమన్నది. "ఇంతకుముందు ఎంత కష్టమొచ్చినా తుస్కారించేదానివి. ఇప్పుడెందుకు మాట మాటకీ అట్లా కంటతడి పెట్టుకుంటావు? నీకొచ్చిన కష్టమేందో చెప్పు."

కాంతమ్మ తమాయించుకొని "కష్టం లేకేనయ్యా" అని చిరునవ్వు నవ్వింది.

చీకటిగదిలో అకస్మాత్తుగా దీపం వెలిగినట్లయింది అతనికి.

"అది సరేగాని, ఇట్లావచ్చి నాపక్కన కూచో."

ఎందుకంటే? అన్నాడు పాపారావు సిగ్గుపడుతూ.

"వొకమాట చెప్పతా."

"ఇక్కడికి ఇనపడుతుందిలే చెప్పు."

"కూచోమంటావుంటే?" అని గద్దించింది కాంతమ్మ.

నెమ్మదిగావెళ్లి ఆమె సరసన కూర్చున్నాడు పాపారావు.

"నిన్నెందుకు ఆ ఎంకన్నతో పోట్లాడావంట?"

"నీకెట్లా తెలిసింది?"

"ముసలయ్యె అన్నాడు."

పోట్లాటకు కారణం చెప్పటం ఇష్టం లేక మెదలకుండా వూరుకున్నాడు పాపా రావు.

"నువ్వు చెప్పకపోయినా నాకుతెలుసు లేవమ్మా!"

"తెలిస్తే నువ్వే చెప్పు."

"నన్నేదో అన్నాడని ఆడితో పోట్లా టావు."

"తప్పా?"

"తప్పో వొప్పో. ఆడసలే కష్ట మనిషి. ఆడితో పెట్టుకోకు."

"ఆడికి నువ్వంటే ఎందుకు అంత కోపం?" అని వున్న వాడు వున్నట్టుండి అకస్మాత్తుగా అడిగాడు.

"నేనంటే అందరికీ కోపమే."

"ఈడికెందుకూ అంట."

"ఆడికి వుండేకారణం ఆడికివుంది."

"ఏందదీ?"

వొకప్పుడైతే చెప్పకపోనేమో! ఇప్పు డామె చాలా బలహీనంగా వుంది. పైగా చేసినపనులన్నీ అతనికి చెప్పి చెయ్యా లనే కోర్కెతోవుంది. అందుకని చెప్పింది.

"వొకసారి ఆడు వరుసగా మూడు రోజులు రిక్షా అద్దె యజమానికి కట్ట లేదయ్యా. వొచ్చింది వొచ్చినట్టు తాగే శాడు. రిక్షా యజమాని డబ్బు కట్టందే రిక్షా ఇవ్వనన్నాడు. ఇవ్వాల్సిన డబ్బుకి పోలీసోళ్లకి రిపోర్టు చేస్తానన్నాడు. ఆడికి పోలీసోళ్లంటే చచ్చేభయం. ఆపాట్న వొచ్చి నా కాళ్లమీదపడి బతిమాలాడు. నాకు జాలేసింది. యజమాని ఇంటికివెళ్లి నెమ్మదిగా తీర్చుకుంటాడనిచెప్పి రిక్షా ఇప్పించా. అప్పటినుంచి ఆడికి నామీద కోపం. మొదటిరోజుల్లో అసలు నాతో మాట్లాడేవాడేకాదు.

"నువ్వెళ్ళి అడిగితే యజమాని వొప్పు కున్నాడా?" అని అడిగాడు పాపారావు ఆమెవైపుకి చూడకుండా

"ఎందుకోసం వొప్పుకోడు?"

"అతడికి డబ్బుకి లంకెగందా."

"మనిషికి వొక డబ్బేకాదయ్యా కావల్సింది. చాలా వుంటై. అంతకు ముందు నాకు కబురెట్టాడు. నేను ఎళ్ళ లేదు. నాఅంత నేనే ఎళ్ళేటప్పటికి మురిసి చచ్చాడు."

పాపారావు కడుపులో ఎవ్వరో చెయ్యి పెట్టి దేవినట్లయింది.

"ఈ సంగతి ఆడికి తెలుసా?"

"ముందేతెలుసు తెలిసే నన్నెళ్ళమని బతిమాలాడు."

"ఈ సారి ఆడు కనపడితే కాళ్ళూ చేతులూ ఇరగ్గొట్టి పారేస్తా."

"అటువంటిపనే చెయ్యొద్దంట" అన్నది కాంతమ్మ కోపంగా.

"ఇక్కడి వాళ్ళతో నువ్వు ఎవ్వరితో పోట్లాడినా నేనిక్కడ వుండను. నా దారిన నేనుపోతా."

"ఎక్కడికి పోతావ్?"

"ఏం నాకు కట్టుకున్న మొగుడు లేనట్లు మాట్లాడుతున్నావ్? ఆడి దగ్గరకు

పోతా?''

అంత కోపంలోనూ ఆమె మాటలకు నవ్వొచ్చింది పాపారావుకి. ''ఆదేమో విన్ను ముద్దునిద్దర పోనిచ్చి కాలు గీర తాడు'' అన్నాడు

ఆమె అతని కళ్ళలోకి బలహీనంగా చూచి నవ్వింది. వొక్కక్షణం కండ్లు తళుక్కున మెరిసినై. ఆ తళుకు ముఖాని కంతా వ్యాపించింది. ''నిన్ను చూచి నప్పుడల్లా నాకు బతకాలని అనిపిస్తుం దయ్యా'' అన్నది

''బతక్కేంచేస్తావ్?'' అన్నాడతను గట్టిగా తనను చుట్టుముడుతున్న భయాన్ని పోగొట్టుకునేందుకు.

ఆమె మాట్లాడలేదు. కళ్ళలో అంతకు ముందు మెరిసిన తళుకు ఇట్టే ఆరి పోయింది.

''నువ్వు చక్కగా నీళ్ళోసుకో. నిన్నూ నీబిడ్డనీ తీసుకువెళ్ళి నేనే అప్ప గించివస్తా.''

''నన్నయితే నేను ఎప్పుడెళ్ళినా ఏల తాడు. ఈ బిడ్డ నాకెందుకంటే?—

''తీసుకొచ్చి నేనే పెంచుకుంటాను''

''ఆ మాటన్నావ్ బాగుంది'' తృప్తిగా, ప్రశాంతంగా నవ్వుకుంది తనలో తాను.

''ఒకమాట, మళ్ళీ మరచిపోతావేమో ఇప్పుడే చెప్పేస్తా.''

''ఏందది?'' అని ఆప్యాయతగా అడి గాడు పాపారావు.

''నన్నొదలి వొచ్చేటప్పుడు కాలు గీరొద్దనిచెప్పు ఆడికి. గీరితే యేలుకున్న ప్పుడే గీరమను.''

''అట్లాగే'' అన్నాడు పాపారావు విరగబడి నవ్వుతూ.

* *

ఒకరోజు కాంతమ్మకు జర్వం వచ్చింది. జ్వరం కొద్దిపాటిదే కాని ఎంత బ్రతుకుతామని ప్రయత్నించినా ఆమెకు బ్రతకబుద్ధి అవటంలేదు. బ్రత కాలని కోరుకోవటం ఆమెకు చేతగావటం లేదు. బ్రతకాలనే ఆపేక్షకు ఆధారమైన దేదో ఆమెలో తెగిపోయినట్లు అనిపిస్తూ వుంది ఆమెకే

''వైద్యుణ్ణి పిలుచుకొస్తాను'' అన్నాడు పాపారావు

''దేనికి వైద్యుడు? రేపటికి అదే తగ్గిపోతుంది'' అన్నది కాంతమ్మ.

కాదు గూడదని అతడు మొండికేసి కూర్చున్నాడు.

''డబ్బెక్కడ తెస్తావయ్యా?'' అని అడిగిందామె

''డబ్బుదేముంది? ఇంటి ఎనకవున్న నల్లకుక్కను పడితే వొస్తుంది'' అన్నా డతను.

ఇక ఆమె అతనిని వారించలేదు. సాయంకాలం అయ్యేటప్పటికి ఎట్లా లేదన్నా వొక్క అయిదురూపాయిలన్నా సంపాదించాలనే సంకల్పంతో బయలు దేరాడు పాపారావు. యజమాని ఇంటికి

వెళ్ళి రిక్షతీసుకొని బజారుకి వెళ్తూ వెళ్తూ కాంతమ్మని వొకసారి చూచి పోదామని వెళ్ళాడు.

ఇంటిముందు పోలీసు వున్నాడు. అతనితో శివయ్యా, ఎంకన్నా ఏదో మాట్లాడుతూ వుండటం చూశాడు, పాపారావు. గబగబా సరాసరి ఇంట్లోకి వెళ్ళాడు. ఆ పోలీసు తన్నంత తీక్షణంగా ఎందుకు చూస్తున్నాడో అతనికి అర్థం కాలేదు

కాంతమ్మ చాప పరచుకొని పడుకొని వుంది

''ఎట్లా వుంది?''

''తేలిగ్గానే వుంది.''

ఆమె మొహంచూస్తే నిజంగా నే తేలిగ్గా ఉందనిపించిం దతనికి.

''ఇంకా ఎళ్ళకుండా ఈడే కూర్చున్నావేం?'' అని అడిగింది.

''ఎళ్తూ ఎళ్తూ ఎట్లావున్నావో చూచి పోదామని వచ్చా.''

''నాకే యిబ్బందీ లేదయ్యా. నువ్వు పని పాడుచేసుకో మాక.''

''బయటవున్న ఆ పోలీసు ఎవడు?''

''నాకు జబ్బుగా వుందని ఎవరో చెపితే చూసిపోదామని వచ్చాడు.''

''నువ్వు ఎరుగుదువా?''

''ఎరక్కేం? నాలుగుబజార్లూ కలిసిన చోట చేతులు వూపుకుంటూ నిలబడతాడు. అతడ్ని ఎవ్వరెరుగరు?''

''మంచోడేనా?''

''మంచోడే! ఈళ్ళ చేసేపనులకి అతను ఉండబట్టి సరిపోయింది. ఈళ్ళ మీద నేను ఎన్ని కేసులు తప్పించాను! అతను మంచోడు కాకపోతే ఈపాటికి ఈళ్ళంతా జైల్లో మడ్డికూడు తింటూ వుండేవాళ్ళే ''

ఇంకా ఎదో అడుగువా౽ అనుకున్నాడు పాపారావు. అడగబుద్ధి పుట్టలేదు

''సరే నే పోతున్నా'' అని బయలుదేరాడు

''తొరగా రా'' అన్నది,

ఎందుకు—అన్నట్టు చూశాడు పాపారావు.


''ఏంలేదు. ఎందుకోగాని నీకు ఒక్కసారి చక్కలిగింతలు పెట్టాలని వుంది.''

అతనికి మొదటిరోజులు జ్ఞాపకం వచ్చినై. తరువాత ఆమె ఒకటి రెండు సార్లు చక్కలిగింతలు పెట్టబోయింది గాని, అతను అందకుండా తప్పించుకుని పారిపోయాడు. ఇవ్వాళ తప్పించుకోలేదు.

''అట్లాగే పెడుదువుగాని, తొందరగనే వస్తా'' అని చెప్పి బయలుదేరాడు.

బయట పోలీసులేడు ఎవ్వరూలేరు. ఎవ్వరి పనిమీద వారు వెళ్ళిపోయారు అనుకున్నాడు పాపారావు. అయిదు రూపాయలు సంపాదించి వైద్యుణ్ణి తీసుకురావాలనే దృఢసంకల్పంతో రిక్షా బ్రరువ తొక్కుకుపోయాడు.

ఎంతడబ్బు ఇస్తానన్నా సరే ఒక్క




మనిషిని కూడా జారిపోనివ్వకుండా రిక్షా కట్టాడు. తాను మామూలుగా వెళ్ళని సందు గొందుల్లోకి కట్టాడు. హైదరాబాద్ లో కొండగుట్టలు ఎక్కువ. అందుకని ఎత్తుప్రదేశంమీదకు రిక్షా కట్టమంటే ఇంత ఇస్తానన్నా జంకేవాడు. వాళ్ళు ఎక్కువ ఇచ్చేమాట నిజమేగాని ఆవాళ రిక్షా తొక్కలేక పోయేవాడు. మొత్తానికి గుండెలు బ్రద్దలు కొట్టుకోవటమే తప్ప సంపాదన ఒక్కటే అయ్యేది. ఇవ్వాళ అతను ఇవన్నీ ఆలోచించలేదు. అతనికి కావలసిందల్లా అయిదు రూపాయలు. రేపేమైనా ఇబ్బందిలేదు. ఎక్కడికి పడితే అక్కడికి. ఎంతకుపడితే అంతకు రిక్షా తొక్కాడు. అతనికి అదృష్టం కూడా కలసి వచ్చింది. బాడుగలు కుప్పలు కుప్పలుగా దొరికినై పొద్దున్న అన్నానికి కూడా వెళ్ళలేదు. గుక్కెడు నీళ్ళు కూడా ముట్టలేదు. ఒక్కక్షణం తీరుపోకుండా. తొక్కినవాడు తొక్కినట్లే వున్నాడు.

సాయంకాలం అయ్యేప్పటికి నాలుగు రూపాయలు చేపట్టాడు. ఇక దొరకాల్సింది రూపాయి, వొక్కరూపాయే! 'దాని తాత గాడికి అచ్చివున్నానా? అదే దొరుకుతుంది' అనుకున్నాడు. అతను అనుకున్నట్టుగానే మినిష్టర్లతో పనివున్న వొక పెద్దమనిషి కొండమీదకు రిక్షా కడితే పది అణాలు ఇస్తానన్నాడు. ఇక కావలసింది ఆరణాలు. మినిష్టర్లదగ్గరకు వెళ్ళిన పెద్దమనిషి రిక్షా దిగగానే, మినిష్టర్లతో పనై పోయివస్తున్న మరొక పెద్దమనిషి నారాయణగూడాకి ఆరణాలు ఇస్తానన్నాడు. పాపారావుకి యింక కావలసిందేముంది? పైగా అతను ఉండేది చిక్కడపల్లిలోనే అది నారాయణ

గూడాకు ఒక ఫర్లాంగుకూడా ఉంది. ఆ పెద్దమనిషిని దింపి సరాసరి ఇంటికి వెళ్ళిపో వచ్చుననుకున్నాడు దారిలోనే ఒక వైద్యుడు కూడా ఉన్నాడు. వెళ్ళేటప్పుడు ఆయన్ని వెంటబెట్టుకొని తీసుకు వెళ్ళ వచ్చుననుకున్నాడు. ఆరణాలకు ఒప్పుకున్నాడు.

ఆ పెద్దమనిషి రిక్షా ఎక్కాడు. రిక్షా జంయిన వెళ్ళిపోతూవుంది. పాపారావు సంతోషం పట్టలేని పరిస్థితుల్లో ఉన్నాడు. పొద్దున్నుంచీ అన్నం లేదేమో; వొళ్ళు తూలిపోతూవుంది. కండ్లు బయర్లుకమ్ముతున్నట్లనిపించింది. కాని వాటిని పట్టించుకునే స్థితిలోలేడు పాపారావు. ఎంత తొందరగా వెళ్ళటానికి వీలుంటే అంత తొందరగా వెళ్ళటమే అతని పని.

రిక్షా నారాయణగూడా చేరింది. ఇంకెంత రెండు ఫర్లాంగులుఅనుకున్నాడు. వేగం హెచ్చించాడు రిక్షాలో కూర్చున్న మనిషికి కాస్త ఎండదెబ్బ తగిలినట్లుంది. లేకపోతే మినిష్టరు దగ్గరకు వెళ్ళేపని కాలేదేమో; సొమ్మసిలి జేరగిలబడి కూర్చున్నాడు రిక్షాలో.


ఆగమేఘాలమీద వెళ్తున్న పాపారావుకి నాలుగు బజార్ల మధ్య పోలీసు నిలబడివుండటం కనపడింది. కాంతమ్మ చెప్పినట్లు అతను క్షణం తీరికలేకుండా చేతులు వూపుతూ నిలబడివున్నాడు. ఇంటిదగ్గర తాను చూచిన పోలీసే అనిపించింది పాపారావుకి తను తీక్షణంగా చూస్తున్నట్లే అనిపించింది. తల తిరుగనారంభించింది. ఎదురుగా కారు వస్తుంటే తప్పుకుందాం అనుకున్నాడు తప్పుకున్నానే అనుకున్నాడు కాని తప్పుకోలేదు. కారు రిక్షాకు గుద్దుకుంది. రిక్షా విరిగి కూలబడింది అతనికి ఒక్క విషయమే జ్ఞాపకం ఉంది. ఆ కారు నల్లగా చీంబోతు లాగుంది. అతనికి అసహ్యం వేసింది.

అతనికి స్పృహ వచ్చేటప్పటికి పోలీసు స్టేషన్లో ఉన్నాడు. అతనిని లాకప్‌లో ఉంచారు. రిక్షా విరిగింది. అంతే ఎవ్వరికీ పెద్ద దెబ్బలు తగల్లేదు. రిక్షా[illegible] చున్నాయన తుంటిమాత్ర[illegible]గా జారింది పాపారావుని వారం రోజులు జైల్లో ఉంచారు. ఆ వారం రోజులూ కాంతమ్మని తలుచుకొని కన్నీరు పెట్టుకున్నాడు. తన కోసం ఎవ్వరన్నా వస్తారేమో అని చూశాడు. రాలేదు. ఆ వారం రోజులూ కంటిమీద కూరుకులేదు. చిక్కి శల్యం అయిపోయాడు. బొడ్డు తడుముకుంటే తను సంపాదించిన డబ్బు డబ్బుగానే ఉంది. నాలుగు రూపాయల పదణాలు, అయిదు రూపాయలు అవటానికి ఇంకా ఆరణాలు తక్కువ. ఆవుర్న ఏడ్చాడు. అక్కడ అతని గోడు వినిపించుకునేది ఎవ్వరు?

ఏడోరోజు అతన్ని జైలునుంచి విడిచిపెట్టారు. అతడు రంయిన యింటికి బయలుదేరాడు. ఈపాటికి కాంతమ్మ జబ్బు నయమయ్యే ఉంటుందనుకున్నాడు.



యు




నయం కాకపోతే మాత్రం ఏం? తాను వెళ్తున్నాడు గదా? ఇక ఆమెకు ఏ ప్రమాదమూ ఉండదు.

అతను ఇంటికి జేరుకునేటప్పటికి తనుండే యింటిచుట్టూ చుట్టుపక్కలవుండే అలగాజనం పోగయివున్నారు. ఆ జనాన్ని చూస్తే ఏదో జరిగిందని భయంవేసింది పాపారావుకి. ఆ జనాన్ని తోసుకుని ఇంట్లోకి సొరచేపల్లే, చురకత్తల్లే వెళ్ళాడు. వెళ్ళిన వాడు వెళ్ళినట్లుగానే నివ్వెరపోయి నిలబడి పోయాడు.

లోపలకు అడుగుపెట్టగానే అతనికి వినబడింది పసిపిల్లవాడు కేరుమనడం. అతని కంటబడింది కాంతమ్మ శవం ఆ శవం చాపమీద పరచబడివుంది. నిండా గుడ్డ కప్పబడివుంది. అతనికి అంతా అర్థమయింది. నెమ్మదిగా వెళ్ళి ముఖంమీద గుడ్డతీసి చూశాడు. ఆ ముఖం చాలా ప్రశాంతంగా ఉంది. జీవితాన్ని హాయిగా వెళ్ళమార్చుకొని గాఢనిద్రలో మునిగినట్లుంది.

"నాలుగు రోజులయింది ప్రసవించి. అప్పుడు స్పృహ తప్పటం కన్ను మూసే వరకూ మళ్ళీ కోలుకోనేలేదు" అన్నది ఒక భాగ్యశాలి.

"పిల్లవాడికి ఏ యిబ్బందీలేదుగా!" అని అడిగాడు.

"లేదు. బాగానేవున్నాడు."

అతను ఒక్కక్షణం చుట్టూ పరికించి చూశాడు. తనతోటి వాళ్ళంతా అక్కడే ఉన్నారు. శివయ్య దూరంగా కాళ్ళు ముడుచుకుని కూర్చునివున్నాడు. పిల్లవాడిని

చేతులో పెట్టుకొని వోదారుస్తున్నాడు మునలయ్య. ముఖాన గుడ్డ కప్పుకొని శవంపక్క నేకూర్చుని ఉన్నాడు వెంకన్న. ఆమె మంచితనం అప్పుడప్పుడే వాళ్ళకి అర్థం అవుతున్నట్లుంది.

ఎవరో "దహన ప్రయత్నాలు చెయ్యటం మంచిది'' అన్నారు.

పాపారావు మాట్లాడలేదు. ఏదో ఆలో చిస్తూ కూర్చున్నాడు. ఆలక్షణం అతనిని చూస్తే అందరికీ భయమే వేసింది. మున లయ్య పిల్లవాణ్ణిదించి నెమ్మదిగా అతని దగ్గరకు వెళ్ళి "ఏమంటావ్ మరి ?'' అన్నాడు.

''ఆమెకు ఇక్కడ దహనం జరగ టానికి వీల్లేదు'' అన్నాడు పాపారావు. అతనిగొంతు దేవాలయంలోని గంటలకు మల్లే ఖంగున మ్రోగింది.

అతను బయటకువెళ్ళి వొక జల్లబండి తీసుకు వచ్చాడు. క్షణంలో దానికి గుడిసె కప్పాడు. శవాన్ని ఆ గుడిసెలో పెట్టాడు. చంటివానిని ఎత్తుకొని బండి ఎక్కాడు.

''పోనివ్వు'' అన్నాడు బండివాడితో.

అతను అడిగిందానికి సహాయం చెయ్యటంతప్ప ఎవ్వరూ పెదవి కదల్ప లేదు. బండి వెళ్తుంటే నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడ్డారు.

బండి కాంతమ్మ అత్తవారి వూరు వెళ్ళి ఆమె ఇంటిముందు ఆగింది;ఎవ్వరో బంధువులు వచ్చారని తలుపులు తీసుకొని గబగబా బయటకు వచ్చాడు కాంతమ్మ మొగుడు. నిలువుగుడ్లువేసి చూస్తూ నిల బడ్డాడు. పాపారావు టూకీగా విషయం చెప్పాడు "నువ్వెప్పటికైనా తిరిగి వొస్తా వనుకున్నాగాని, ఇట్లా వస్తావని అనుకో లేదు కాంతం'' అని బోరున ఏడ్చా డతను.

కర్మకాండ ముగిసింతర్వాత, "పిల్ల వాణ్ని ఎవరు పెంచాలీ?'' అని కాంతమ్మ భర్తదికూడా ఆడదిక్కులేని సంసారమే. ఆ కారణంవల్లగానీ, పిల్లవాడి తండ్రి పాపారావనే నమ్మిగానీ, వూళ్లోపెద్దలు ఆ భారం పాపారావు మీదే వేశారు.

పాపారావు మనసారా ఆ భారం మొయ్యటానికి అంగీకరించాడు. మొదట్లో ఇందుకు కాంతమ్మ భర్త అంగీకరించ లేదుగాని, పెద్దల సహాయంమీద పాపా రావు ఇష్టానికి వొదిలివేశాడు.

దినం పూర్తయింది. పిల్లవాణ్ని తీసు కొని పాపారావు టౌనుకు బయలుదేరాడు. ఊరి పొలిమేరదాకా సాగనంపాడు కాంతమ్మభర్త, అప్పుడప్పుడూ వచ్చి చూచిపోతానని చెప్పి వెనుదిరిగి వెళ్ళి పోయాడు.

పిల్లవాణ్ని పొత్తిగుడ్డల్లో పెట్టుకొని ముందుకు నడిచాడు పాపారావు. "పుట్ట బోయే పిల్లవాణ్ని నేనే పెంచుకుంటాను'' అని తాను అన్నప్పుడు ''ఆ మాట అన్నావ్, బాగుంది'' అన్న కాంతమ్మ మాటలు జ్ఞాపకం వచ్చి అతని వొళ్ళు ఉప్పొంగింది.